# డైరెక్టర్‌గారి శిష్యుడు

"హలో.. సత్యం.. ! ...నేనయ్యా డైరక్టర్‌గార్ని"

"హలో.. నమస్తేసార్.. నేనే మాట్లాడుతున్నాను"

"సత్యం! ఎవరో ఒక ప్రొడ్యూసర్ వచ్చాడయ్యా. కథ చెప్పమంటున్నాడు. అప్పుడెప్పుడో నువ్ ఏదో లైనుందని చెప్పావని గుర్తొచ్చింది.. వస్తావేంటి.. ఓసారి కథ మీద కూచుందాం"

డైరక్టర్ ఈశ్వరరెడ్డిపై కోపాన్ని కన్నీళ్ళలా మార్చి కసిని దాచి “సారీ సర్ ఆ కథ ఎప్పుడో అమ్మేసాను” అన్నాడు సత్యం.

“అచ్చా వెరీగుడ్- సెట్స్‌కెళ్లిందా? ఏమిచ్చారు??”

“నిర్మాతలకి కాదండి నేనిచ్చింది- పచారీ దుకాణంవాడికి- అతనేమిచ్చాడంటే.. రెండ్రోజుల పోపు సామాన్లు- నా పేపర్ల మీదే.. ఆరు చిన్న చిన్ని పొట్లాలు కట్టించుకుని తెచ్చాను”

“ఎంత పని చేశావయ్యా.. కొంచెం ఓర్పు వహించి ఉంటే..”

“నాకు తెలుసండీ.. తీసిన మీకు, రాసిన నాకూ, పెట్టుబడి పెట్టిన నిర్మాతకి నంది అవార్డు వచ్చేది. మన ముగ్గుర్లో ఎవర్లోనో బేడ్‌లక్ ఉండి.. స్క్రిప్ట్ పచారీ దుకాణంకెళ్లిపోయింది”

“వెరీ బేడ్! ఒకసారి రా! నీకు జ్ఞాపకం ఉన్నంతమేర కథ చెప్పు- పేచింగులూ, మేచింగులూ నేను టకటకా.. చెప్పేస్తాను” అన్నాడు ఈశ్వరరెడ్డి!

‘జీ.. వి.. తం...లో మళ్ళీ నీ ముఖం చూస్తాన్రా’ అనుకున్నాడు సత్యం అక్కసుగా- పదిహేను సినిమాల దర్శకుడిగా ఆయన సాధించిన విజయాల వెనక సత్యం పడిన శ్రమ ఎంతో, అతని కంట్రిబ్యూషనెంతో పేరుకి అసిస్టెంటేగానీ సగానికి సగం పైగా క్రెడిట్ సత్యానిదే.. అని అందరికీ తెలుసు. టెక్నీషియన్లూ, యాక్టర్లూ కూడా సత్యాన్నే అడిగి సబ్జెక్ట్ క్లారిఫై చేసుకునేవాళ్లు-

ఆ ఉత్సాహంలో సత్యం మెదడు ఆత్మ విశ్వాసంతో వికసించింది. తనమీద తనకి నమ్మకం కుదిరాక.. ఆహా.. కాదు. డైరెక్టర్ రెడ్డిగార్కి కూడా నమ్మకం కుదిరాక.. సత్యానికి తను సొంతంగా ఎడిటింగూ, డబ్బింగూ, రీ-రికార్డింగూ, మిక్సింగూ చేయించగలనని రెడ్డిగారు ముద్రవేసి తప్పించుకు తిరగడం మొదలెట్టాక... పనంతా పూర్తి చేయించుకుని

డైరెక్టర్‌గారితో "సార్ ఒక కథనుకున్నాను. మీరు వింటే బావుందంటే.. మన ప్రొడ్యూసర్‌గారికి చెబుదామనుకుంటున్నాను" అన్నాడు సత్యం వినయంగా.

వెటకారంగా నవ్వి "డైరెక్టర్ అయిపోదామనా? నేను ముందు కథ వింటాన్లే. నీకు అన్ని ఫేకల్టీస్‌లోనూ కొద్దోగొప్పో అనుభవం కల్గించాను.. నువ్వెప్పుడు డైరెక్టరవ్వాలో నేను చెప్తాను" అని గాలి తీసేశాడు.

పదిహేను సినిమాలకు పంచ ప్రాణాలు పోసి అన్ని విభాగాల్లోనూ పని చేసిన తనపై అతనికున్న గౌరవం ఏమిటో తెలిశాక ఇంటికొచ్చేశాడు.. మళ్ళీ ఏ సినిమా కంపెనీకి వెళ్ళలేదు. సినిమా అంటేనే విరక్తి పుట్టి తప్పించుకు తిరుగుతున్న సత్యానికి ఈ వేళ డైరెక్టర్ ఫోను ఫ్లాష్‌బేక్‌ని కుదిపింది.

✦ ✦ ✦

"ఎక్కడికెళ్తున్నారు?" భార్య అడిగిన ప్రశ్నకి సత్యం జవాబు చెప్పడానికి తటపటాయించాడు. ఫైళ్ళ సంచి చంకనెట్టుకుని బయల్దేరుతున్న సత్యం "దెబ్బతిన్న నా అహం ఇవ్వాళ కోలుకుంది. ఇండస్ట్రీకి దూరంగా బ్రతికిన నేను నా సత్తా నిరూపించుకుంటాను – నేనేంటో ఒక్కడికి తెలిసినా చాలు" అన్నాడు సత్యం పొగరుగా.

"ఆ ఈశ్వరరెడ్డి దగ్గరికేనా వెళ్ళేది"

"డైరెక్టరుగారిలాగే నీక్కూడా నేనంటే తెలీదా? పార్వతీ.."

పార్వతి బాధపడింది.

"అది కాదండీ– ఆ సినిమా ఫీల్డొద్దని వదిలేసి మనం ఏదో చీరలకొట్టు పెట్టుకుని హాయిగా బ్రతుకుతున్నాం ఇప్పుడు మళ్ళీ.."

"పార్వతీ.. ఎనిమిదేళ్ల క్రితం నే చెప్పిన కథ విని ఎగతాళి చేసిన

డైరెక్టరు ఇవాళ రమ్మని పిలిచాడు. ఇది నా శక్తికి నిదర్శనమనే నేననుకుంటున్నాను. ఎదురు... రా"

పార్వతి సత్యం బుగ్గల మీద ముద్దుపెట్టుకుంది.

ఆ ముద్దు యాభయ్యేళ్ళ సత్యానికి కొత్త శక్తినిచ్చింది. పార్వతి ఎదురుగుండా వచ్చింది.

✦ ✦ ✦

మూణ్ణెల్ల తర్వాత సత్యం ఈశ్వరరెడ్డి ఇంటికి ఫోన్ చేశాడు.

"హలో డైరెక్టర్ ఈశ్వర్రెడ్డి హియర్"

"అయామ్ సత్యం స్పీకింగ్- ఇవాళ ప్రసాద్ లేబ్‌లో నా సినిమా ప్రివ్యూ షో చేస్తున్నాం సార్. మీరు చూడ్డానికి రావాలి"

"ఎవరూ మాట్లాడేది?"

"నేను సినిమా డైరెక్టర్‌నండీ.. నా పేరు సత్యం. మీరు తప్పకుండా రండి"

'సత్యం అంటే ఏ సత్యం? నాకు తెలిసున్న సత్యాలు ఇరవై ఏళ్లుగా అసిస్టెంట్ డైరెక్టర్‌గా వున్న గొర్రెతోక సత్యం. ఇంకోకతను సినిమా స్క్రిప్టులు కిరాణా దుకాణానికి అమ్మిన గారపళ్ళ సత్యం. ఇంకొకడు కె.సత్యం అతనిప్పుడు లేదు. స్టేట్స్‌లో కొడుకు దగ్గరుంటున్నాడని విన్నాను.. మరి ఎవరు.. ఎవరు..?' అనుకుంటూ ఇంత కాలానికి తనని ప్రివ్యూ చూడ్డానికి రమ్మన్న కొత్త డైరెక్టరెవరో తెలుసుకోవాలని ఓపిక చేసుకుని వెళ్లాడు.

తనని ఇలా సినిమా వాళ్ళెవరూ ఈ మధ్యన ఫంక్షన్‌కి పిలవలేదు. ఇన్నాళ్ళకొచ్చిన అవకాశం. పాత ఫ్రెండ్స్‌ని కలిసే మహదవకాశం అయినా మనిషిలో ఉండే ఇగో వెనక్కి లాగింది.

ఉత్సుకత ముందుకు తోసింది.

చెప్పిన టైంకి థియేటరుకెళ్లాడు. గారపల్ల సత్యం ఆటో దిగుతున్న ఈశ్వర్రెడ్డికి ఎదురొచ్చి కిందికి ఆప్యాయంగా చేయందించి దింపి "గురువుగారూ కారు పంపించమని చెప్పచ్చుగా- ఆటోలో వచ్చారేంటీ?" అంటూ ఆటో అతనికి డబ్బులిచ్చి పంపేశాడు.

ఆ మాటల్లో గారపళ్ళ సత్యమే సినిమా డైరెక్టరని తెలుసుకుని కుచించుకుపోయాడు.

సినిమా చూశాక సత్యంలో గొప్పదనాన్ని గమనించి మనస్ఫూర్తిగా ఆలింగనం చేసుకున్నాడు.

"ఈ కథ నువ్వే రాశావా సత్యం?"

"అవున్సార్.. ఇది వరకు మీకు చెప్పాను అదేనండీ. పచారీ షాపులో అమ్మేసిన కథే మళ్ళీ రాసాను" అన్నాడు సత్యం.

ఈశ్వర్రెడ్డి గొంతులో మాట లేదు. గట్టిగా సత్యాన్ని కౌగిలించుకుని "ఈ సినిమాకి అవార్డులు కుప్పలు తెప్పలుగా రావడం ఖాయం" అన్నాడు ఈశ్వర్రెడ్డి.

సత్యం చలించలేదుగానీ ఆ దృశ్యాన్ని చూసిన పార్వతి ఆనంద బాష్పాలు ఆపుకోలేకపోయింది.

బయల్దేరుతున్న ఈశ్వర్రెడ్డిగారితో "ఆగండి సార్ కారులో వెళుదురు గాని" అన్నాడు సత్యం గౌరవంగా.

"వద్దయ్యా సత్యం. డాక్టరు వాకింగ్ చెయ్యమన్నాడు" అని తల దించుకుని వెళ్ళిపోతున్న ఈశ్వర్రెడ్డిగారిని చూసి సత్యం 'పాపం' అనుకుంటూ జాలిగా కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

